సాక్షి నిర్మల్

శనివారం । 28 । అక్టోబర్ । 2023

పెద్దయ్యాక.. కారెక్కాలె..!

ఎన్నికల ప్రచారంలో భాగంగా భాగంగా శుక్రవారం జిల్లాకేంద్రంలోని రాంరావుబాగ్‌లో మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఓ ఇంట్లో ఇలా చిన్నారిని ఎత్తుకుని ఆడించారు.

– నిర్మల్



గరిష్ఠం/కనిష్ఠం
32.4 / 18.2

వాతావరణం

వాతావరణం పొడిగా ఉంటుంది. ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గుతాయి. రాత్రి ఉష్ణోగ్రతలు సాధారణం కన్నా తక్కువగా నమోదవుతాయి. చలి ప్రభావం పెరుగుతుంది.

న్యూస్‌రీల్

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న కిశోర్‌కుమార్

ముధోల్: రైతులు కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్ అన్నారు. మండలంలోని బోరిగాం గ్రామంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతులు పండించిన ధాన్యాన్ని దళారులకు విక్రయించి మోసపోకుండా ఉండేందుకు కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. రైతులు తమ ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి మద్దతు ధర పొందాలని సూచించారు. క్వింటాలుకు ఏ గ్రేడ్ ధాన్యానికి రూ.2,203, బి గ్రేడ్ ధాన్యానికి రూ.2,183 మద్దతు ధర చెల్లించనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో డీసీవో ఎండీ.అలీం, డీఎం శ్రీకళ, డీటీ హన్మంతు, తహసీల్దార్ అతికొద్దీన్, ఎంపీడీవో సురేశ్‌బాబు, వ్యవసాయశాఖ అధికారి అజ్మీర భాస్కర్ ఉన్నారు.

నేడు పాఠశాలల్లో తల్లిదండ్రుల సమావేశం

నిర్మల్ రూరల్: జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో శనివారం తల్లిదండ్రుల సమావేశం నిర్వహించాలని డీఈవో రవీందర్‌రెడ్డి ఆదేశించారు. ఈ సమావేశంలో పాఠశాలల్లో విద్యార్థుల నమోదు పెంచేందుకు తల్లిదండ్రుల నుంచి సూచనలు, సలహాలు తీసుకోవాలని తెలిపారు. పాఠశాలల్లో నిర్వహిస్తున్న కార్యక్రమాలు, వసతులు, సౌకర్యాలు తదితర అంశాలపై చర్చించాలని పేర్కొన్నారు. ఇటీవల విద్యార్థులకు నిర్వహించిన పరీక్షల ఫలితాలు వెల్లడించాలని సూచించారు. ఎంఈవోలు, జిల్లా కోఆర్డినేటర్లు, కాంప్లెక్స్ ప్రధాన ఉపాధ్యాయులు సమావేశాలను పర్యవేక్షించాలని తెలిపారు.

సకాలంలో వ్యాధి నిరోధక టీకాలు వేయాలి

- డీఎంహెచ్‌వో ధనరాజ్



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో ధనరాజ్

నిర్మల్‌చైన్‌గేట్: గర్భిణులు, పిల్లలకు అన్ని రకాలైన వ్యాధి నిరోధక టీకాలను సకాలంలో వేయాలని డీఎంహెచ్‌వో ధనరాజ్ అధికారులను ఆదేశించారు. జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయంలో వ్యాధి నిరోధక టీకాల పంపిణీపై జిల్లాలోని ఆరోగ్య పర్యవేక్షకులతో శుక్రవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో వివిధ కారణాలతో టీకాలు తీసుకోని గర్భిణులు, పిల్ల లను గుర్తించి టీకాలు వేయాలన్నారు. జిల్లాలో నూటికి నూరు శాతం లక్ష్యాన్ని సాధించాలని ఆదేశించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వారీగా ప్రగతి సాధించాలన్నారు. సమావేశంలో జిల్లా డిప్యూటీ వైద్య, ఆరోగ్య శాఖ అధికారి రాజేందర్, కార్యక్రమ నిర్వహణ అధికారులు డాక్టర్ నయనారెడ్డి, డాక్టర్ శ్రీనివాస్ జిల్లాలోని సామాజిక ఆరోగ్య అధికారులు, ఆరోగ్య విస్తరణ అధికారులు, ఆరోగ్య పర్యవేక్షకులు పాల్గొన్నారు.

కిషన్‌రెడ్డి క్షమాపణ చెప్పాలి

- బీఆర్‌ఎస్ ముధోల్ ఇన్‌చార్జి పురాణం సతీశ్‌కుమార్



మాట్లాడుతున్న పురాణం సతీశ్‌కుమార్

భైంసా/భైంసాటౌన్: భైంసాను పాకిస్తాన్‌తో పోల్చిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి ఇక్కడి ప్రజలకు క్షమాపణ చెప్పాలని బీఆర్‌ఎస్ ముధోల్ నియోజకవర్గ ఇన్‌చార్జి పురాణం సతీశ్‌కుమార్ డిమాండ్ చేశారు. పట్టణంలోని బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం మాట్లాడారు. కేబినెట్ హోదాలో ఉన్న వ్యక్తి మత విద్వేషాలను రెచ్చగొట్టేలా వ్యాఖ్యలు చేశారని పేర్కొన్నారు. ముధోల్ ప్రజలకు క్షమాపణ చెప్పిన తరువాతే ఆ పార్టీ అభ్యర్థి ప్రచారానికి రావాలన్నారు. ఇక, రైతుబంధు నిలిపేయాలంటూ ఢిల్లీలో కేంద్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసిన టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డికి ఆ పార్టీకి రైతులపై చిత్తశుద్ధి లేదని విమర్శించారు. ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ అభ్యర్థి విఠల్‌రెడ్డి మాట్లాడుతూ కర్ణాటకలో వాగ్దానాలు నెరవేర్చని కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీలంటూ చేస్తున్న ప్రచారాన్ని ప్రజలు నమ్మవద్దన్నారు. ప్రజలు కేసీఆర్‌ను నమ్ముతున్నారని, రాబోయేది బీఆర్‌ఎస్ ప్రభుత్వమేనని ధీమా వ్యక్తం చేశారు. సమావేశంలో మురళిగౌడ్, కృష్ణ, సూర్యకాంత్‌రెడ్డి, జీకే.పటేల్, రమేశ్ మాశెట్టివార్ పాల్గొన్నారు.

పటేళ్లకే కాంగ్రెస్ టికెట్లు

- ఖానాపూర్.. వెడ్మబొజ్జు పటేల్
- ముధోల్.. నారాయణరావు పటేల్
- విశ్వసనీయత, సీనియారిటీకి పట్టం
- కొత్త ఆశావహులకు మొండి'చేయి'



నిర్మల్: కార్యకర్తలు భావిస్తున్నట్లే కాంగ్రెస్ టికెట్లను ఖరారు చేసింది. జిల్లాలో మిగిలిన ముధోల్, ఖానాపూర్ అభ్యర్థులను శుక్రవారం రెండోజాబితాలో ప్రకటించింది. ముధోల్ అభ్యర్థిగా సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్యే భోస్లే నారాయణరావుపటేల్, ఖానాపూర్ అభ్యర్థిగా ఆదివాసీ యువనేత, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెడ్మ బొజ్జుపటేల్‌ను ఖరారు చేసింది. దీంతో రెండు నియోజకవర్గాల్లో పార్టీ కార్యకర్తలు, అభ్యర్థుల అనుచరులు సంబురాలు చేసుకుంటున్నారు. కొంతకాలంగా టికెట్ ఆశిస్తున్న వారికి మొండిచేయి ఇవ్వడంతో వారంతా నిరాశలో ఉన్నారు. కాంగ్రెస్ రెండో జాబితా ప్రకటనతో జిల్లాలోని మూడు నియోజకవర్గాల్లో మూడు ప్రధాన పార్టీల అభ్యర్థులంతా ఖరారైనట్లయింది.

ముధోల్‌లో సీనియారిటీకే సీటు

పార్టీలో తిరిగి చేరిన వారం రోజులకే మాజీ ఎమ్మెల్యే భోస్లే నారాయణరావు పటేల్‌కు కాంగ్రెస్ ముధోల్ టికెట్ ఖరారు చేసింది. ఈనెల 20న ఆర్మూర్‌లో రాహుల్‌గాంధీ సమక్షంలో ఆయన పార్టీలో చేరారు. 2018 ఎన్నికలకు ముందు ఆయన కాంగ్రెస్‌లోనే ఉన్నప్పటికీ అప్పుడు టికెట్‌ను రామారావుపటేల్‌కు ఇవ్వడంతో తను నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ(ఎన్‌సీపీ)లో చేరి బరిలో నిలిచారు. ఆ తర్వాత నుంచి తటస్థంగా ఉన్నారు. తాజాగా కాంగ్రెస్‌లో చేరి, ఈసారి టికెట్ దక్కించుకున్నారు. కాంగ్రెస్ పార్టీ కూడా ముధోల్ నియోజకవర్గ పరిస్థితులను గత కొన్నినెలలుగా సమీక్షిస్తోంది. కొత్తగా చేరిన డాక్టర్ కిరణ్ కొమ్రెవార్, సీనియర్లు ఆనంద్‌రావుపటేల్, విజయ్‌కుమార్‌రెడ్డితోపాటు బోథ్‌కు చెందిన తుల అరుణ్‌కుమార్ పేర్లనూ పరిశీలించింది. కానీ నియోజకవర్గంలో బీఆర్‌ఎస్, బీజేపీలను తట్టుకోవాలంటే బలమైన నేత కావాలని వేచిచూసింది. ఇదే సందర్భం కోసం ఎదురుచూస్తున్న నారాయణరావుపటేల్ కూడా వెంటనే కాంగ్రెస్‌లో చేరారు. ఆయన సీనియారిటీ, పార్టీతో గత అనుబంధం ఉండటంతో ఈసారి కాంగ్రెస్ టికెట్ ఖరారు చేసింది.

'విశ్వసనీయత'కు ఖానాపూర్ టికెట్..

తన దగ్గర ఎన్నికలను తట్టుకునేంత ఆస్తిపాస్తులు లేకున్నా.. ఆదివాసులు, ప్రజల్లో ఆయనపై ఉన్న నమ్మకం, పార్టీపై తను చూపుతున్న విశ్వసనీయతను పరిగణనలోకి తీసుకునే వెడ్మ బొజ్జుపటేల్‌కు కాంగ్రెస్ ఖానాపూర్ టికెట్ ఖరారు చేసింది. పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డికి దగ్గరి మనిషిగా పేరున్న ఆదివాసీ యువనేత బొజ్జుకు క్రియాశీల రాజకీయాల్లోకి వచ్చిన రెండేళ్లకే ఎమ్మెల్యే టికెట్ దక్కింది. ఎస్టీ రిజర్వుడు నియోజకవర్గమైన ఖానాపూర్ నుంచి బీఆర్‌ఎస్‌లో నుంచి ఈనెల 20న కాంగ్రెస్‌లో చేరిన సిట్టింగ్ ఎమ్మెల్యే రేఖానాయక్, పార్టీ సీనియర్ నేతలు భరత్‌చౌహాన్, వినోద్‌నాయక్, చారులత రాథోడ్, రాంకిషన్‌నాయక్ తదితరులు సీరియస్‌గా ప్రయత్నించారు. రేఖానాయక్ భర్త శ్యాంనాయక్‌కు ఆసిఫాబాద్ టికెట్ ఇవ్వడంతో ఆమెకు ఇక్కడ కేటాయించలేదు. మిగిలినవారిలో బొజ్జు ఒక్కడే ఆదివాసీ. ఇక్కడ బీఆర్‌ఎస్, బీజేపీ లంబాడా సామాజికవర్గానికి చెందిన జాన్సన్‌నాయక్, రమేశ్‌రాథోడ్‌కు టికెట్ ఇచ్చాయి. ఈ కారణంతోపాటు పీసీసీ చీఫ్ ఆశీస్సులూ ఉండటంతో బొజ్జు వైపే పార్టీ అధిష్టానం మొగ్గుచూపింది.

మెజారిటీ వీరులు వీరే..

భైంసాటౌన్: ఎన్నికలంటేనే రాజకీయ ప్రత్యర్థుల మధ్య పోటాపోటీ. కొందరు అతి తక్కువ ఓట్లతో ఓడిన సందర్భాలుండగా, మరికొందరు సమీప అభ్యర్థులపై భారీ మెజారిటీతో గెలుపొందారు. 1957 నుంచి 2018 ఎన్నికల వరకు జిల్లాలోని నిర్మల్, ముధోల్, ఖానాపూర్ నియోజకవర్గాల్లో భారీ మెజారిటీ సాధించిన అభ్యర్థుల వివరాలు పరిశీలిస్తే.. నిర్మల్ నియోజకవర్గంలో పి.నర్సారెడ్డి సమీప అభ్యర్థి ప్రభాకర్‌రెడ్డిపై 48 శాతం మెజారిటీ ఓట్లు సాధించారు. ముధోల్ నియోజకవర్గంలో గడ్డిగారి గడ్డెన్న, సమీప అభ్యర్థి జీజీ.రెడ్డిపై 49 శాతం మెజారిటీతో గెలుపొందారు. ఖానాపూర్ నియోజకవర్గంలో అజ్మీరా రేఖానాయక్ 32 శాతం మెజారిటీ ఓట్లతో విజయం సాధించారు.

నియోజకవర్గం : నిర్మల్



పి.నర్సారెడ్డి

ఎన్నికల ఏడాది : 1962
మొత్తం పోలైన ఓట్లు : 31,261
పి.నర్సారెడ్డి : 22,147(కాంగ్రెస్)
ప్రభాకర్‌రెడ్డి : 7,724 (స్వతంత్ర)
మెజారిటీ : 14,423(48.28శాతం)

నియోజకవర్గం : ముధోల్



గడ్డిగారి గడ్డెన్న

ఎన్నికల ఏడాది : 1967
మొత్తం పోలైన ఓట్లు : 48,413
గడ్డిగారి గడ్డెన్న : 34,610 (స్వతంత్ర)
జీజీ.రెడ్డి : 11,701 (కాంగ్రెస్)
మెజారిటీ : 22,909 (49.47శాతం)

నియోజకవర్గం : ఖానాపూర్



రేఖానాయక్

ఎన్నికల ఏడాది : 2004
మొత్తం పోలైన ఓట్లు : 88,465
రేఖానాయక్ : 56,400 (టీడీపీ)
కె.భీంరావు : 24,031 (కాంగ్రెస్)
మెజారిటీ : 32,369 (37.81శాతం)

కాంగి'రేస్ షురూ'

- పదింట తొమ్మిది చోట్ల అభ్యర్థులు ఖరారు
- చెన్నూరు స్థానం పొత్తులో సీపీఐకి కేటాయింపు
- అసంతృప్తులు, వర్గ పోరే అభ్యర్థులకు ఇబ్బందులు

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: 'హస్తం' పార్టీ అభ్యర్థుల ఎంపిక పూర్తయింది. రెండో జాబితాలో ఉమ్మడి ఆదిలాబాద్ నుంచి మరో ఆరు స్థానాలకు అభ్యర్థుల పేర్లను ఖరారు చేస్తూ ఆ పార్టీ కేంద్ర ఎన్నికల కమిటీ వెల్లడించింది. దీంతో ఇప్పటివరకు తొమ్మిది స్థానాల్లో టికెట్లు ఖరారు కాగా, ఒక్క చెన్నూరు సీటుపై ఎలాంటి ప్రకటన రాలేదు. ఆ స్థానాన్ని సీపీఐకే కేటాయించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. తాజాగా ప్రకటించిన ఆరు స్థానాల్లో బోథ్-వన్నెల అశోక్, ఆదిలాబాద్-కంది శ్రీనివాస్‌రెడ్డి, ముధోల్–బోస్లే నారాయణ్‌రావు పాటిల్, సిర్పూర్–రావి శ్రీనివాస్‌కు ఖరారైంది. దీంతో ఉమ్మడి జిల్లాలో మొదటి జాబితాలో పది స్థానాలకు మంచిర్యాల, నిర్మల్, బెల్లంపల్లి స్థానాలకు అభ్యర్థులను ప్రకటించగా, తాజాగా మరో ఆరు స్థానాలు వెల్లడయ్యాయి. మిగిలిన చెన్నూరు సీటును పొత్తులో సీపీఐకి కేటాయిస్తారా? అనేది స్పష్టత రావాల్సి ఉంది.

ఇద్దరు ఎమ్మెల్యేలకు దక్కని చోటు

తమకు టికెట్లు ఇవ్వలేదని అధికార బీఆర్‌ఎస్ పార్టీని వీడి కాంగ్రెస్‌లో చేరిన బోథ్, ఖానాపూర్ ఎమ్మెల్యేలు రాథోడ్ బాపురావు, రేఖానాయక్‌కు 'హస్తం' పార్టీ మొండి చేయి చూపింది. ఎలాగైనా ఈసారి పోటీ చేయాలని భావించిన ఇద్దరు ఎమ్మెల్యేలు కాంగ్రెస్ పార్టీ నుంచి టికెట్ ఆశించారు. వీరిలో ఎవరికీ టికెట్ దక్కలేదు. రేఖానాయక్ భర్త శ్యామ్‌నాయక్‌కు మాత్రం ఆసిఫాబాద్ సీటు ఇవ్వడంతో ఇద్దరిలో ఒకరితో సరిపుచ్చుకోవాల్సి వచ్చింది. రేఖానాయక్‌కు లోక్‌సభ ఎన్నికల్లో ఆదిలాబాద్ నుంచి ఎంపీ అభ్యర్థిగా అవకాశం కల్పిస్తారని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఇప్పటికీ అధికారికంగా కండువా కప్పుకోని ఎమ్మెల్యే బాపురావుకు ప్రత్యామ్నాయంగా ఏదైనా అవకాశం కల్పించే అవకాశం ఉంది. ఇక ఆదిలాబాద్‌లో కంది శ్రీనివాస్‌రెడ్డి, ముధోల్‌లో నారాయణ్‌రావు పాటిల్ వైపు ఎంపిక కమిటీ మొగ్గు చూపింది.

రెండు ఆదివాసీ, ఒకటి లంబాడా

ఉమ్మడి జిల్లాలో మూడు ఎస్టీ స్థానాలు ఉండగా, ఈసారి రెండు సీట్లు ఆదివాసీలకే దక్కాయి. లంబాడా వర్గానికి చెందిన సిట్టింగ్ ఎమ్మెల్యేలు పోటీ పడినప్పటికీ వారిని పక్కకు పెట్టి మరీ ఖానాపూర్, బోథ్‌లో ఆదివాసీ నాయకులకే ప్రాధాన్యత ఇచ్చారు. ఇక ఆసిఫాబాద్ సీటు మొదటి నుంచి ఆదివాసీలకు ఇవ్వగా ఈసారి లంబాడ వర్గానికి చెందిన శ్యామ్‌నాయక్‌ను వ్యూహాత్మకంగా బరిలో దింపారు. దీంతో వచ్చే ఎన్నికల్లో ఈ రెండు వర్గాల్లో ఎవరు నెగ్గుతారనేది ఆసక్తి నెలకొంది. టికెట్లు దక్కిన ఇద్దరు ఆదివాసీల్లో పీసీసీ చీఫ్, రేవంత్‌రెడ్డి అనుయాయులుగా ఉన్న వెడ్మ బొజ్జు, మాజీ ఎమ్మెల్సీ పీఎస్సార్ వర్గంగా ఉన్న వన్నెల అశోక్ కావడం గమనార్హం.

ఇక కదనరంగంలోకి...

కాంగ్రెస్‌లో టికెట్ల కేటాయింపులు కొలిక్కి రాక ఆశావహుల్లో రోజులు గడిచే కొద్దీ ఉత్కంఠ కొనసాగుతోంది. ఈ క్రమంలో అనేక వడపోతలు, సర్వేలు, సమీకరణాలతో చివరకు ఉమ్మడి జిల్లాలో దాదాపు సీట్ల ఖరారు పూర్తయినట్లే. దీంతో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు కదన రంగంలోకి దూకనున్నారు. టికెట్ దక్కని నాయకులు, వర్గ పోరును అభ్యర్థులు ఎలా ఎదుర్కొని గెలుపు తీరాలకు వెళ్తారనేదే పెద్ద సవాల్‌గా మారింది.

రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారిని కలిసిన కలెక్టర్



వికాస్‌రాజ్‌కు పూలమొక్క అందిస్తున్న కలెక్టర్

నిర్మల్‌చైన్‌గేట్: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని కలెక్టర్లు, పోలీస్ అధికారులు, రిటర్నింగ్ అధికారులతో ఎన్నికల నిర్వహణ, ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలుపై మంచిర్యాల కలెక్టరేట్‌లో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ శుక్రవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్మల్ కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారిని మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్క అందజేశారు.

ఎన్నికలకు పకడ్బందీగా ఏర్పాట్లు



సమావేశంలో రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్‌రాజ్, కలెక్టర్లు, ఎస్పీలు, అధికారులు

- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్
- ఎన్నికల నిర్వహణపై ఉమ్మడి జిల్లా అధికారులకు దిశా నిర్దేశం

మంచిర్యాలఅగ్రికల్చర్: ఎన్నికల నిర్వహణకు అధికారులు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని, నిష్పక్షపాతంగా విధులు నిర్వర్తించాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్‌రాజ్ అన్నారు. శుక్రవారం మంచిర్యాల జిల్లా నస్పూర్‌లోని సింగరేణి గెస్ట్‌హౌస్‌లో అదనపు డీజీపీ సంజయ్‌కుమార్ జైన్‌తో కలిసి ఉమ్మడి జిల్లా ఎన్నికల అధికారులు, కలెక్టర్లు, సీపీ, అదనపు కలెక్టర్లు, ఎస్పీలు, డీసీపీలు, ఏసీపీలతో ఎన్నికల నిర్వహణపై సమీక్ష నిర్వహించారు. అంతకుముందు మంచిర్యాల జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బి.సంతోష్ పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు. అనంతరం నస్పూర్‌లోని సమీకృత కలెక్టరేట్ ఆవరణలో ప్రజలను చైతన్యపర్చేందుకు జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో 'నేను కచ్చితంగా ఓటు వేస్తాను' అనే నినాదంతో కొనసాగుతున్న కళాజాత కార్యక్రమంలో ఓటరు ప్రతిజ్ఞ చేశారు. జిల్లా ఎన్నికల అధికారి సంతోష్, రామగుండం పోలీసు కమిషనర్ రెమా రాజేశ్వరి, జిల్లా అదనపు కలెక్టర్ మోతీలాల్, డీసీపీ సుధీర్ రాంనాథ్ కేకన్ పాల్గొన్నారు.

ప్రతీ అంశంపై సూచనలు

కలెక్టర్ సమావేశ మందిరంలో మూడున్నర గంటలపాటు సమావేశం సాగింది. రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్‌రాజ్ అదనపు డీజీపీ సంజయ్‌కుమార్‌జైన్‌తో కలిసి ఎన్నికల అధికారులు, కలెక్టర్లు బి.సంతోష్(మంచిర్యాల), బొర్కడే హేమంత్(కుమురంభీం), ఆశిష్ సంగ్వాన్(నిర్మల్), రాహుల్ రాజ్(ఆదిలాబాద్), రామగుండం సీపీ రెమా రాజేశ్వరి, మంచిర్యాల డీసీపీ సుధీర్‌రాంనాథ్, ఎస్పీలు ఉదయ్‌కుమార్‌రెడ్డి(ఆదిలాబాద్), సురేష్‌కుమార్(కుమురంభీం), చల్లా ప్రవీణ్‌కుమార్(నిర్మల్), ఉమ్మడి జిల్లాలోని నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులతో ఎన్నికల నిర్వహణ, ఈవీఎంల భద్రత, చెక్‌పోస్టుల నిర్వహణ, పోలింగ్ కేంద్రాలు, శాంతిభద్రతలు, మోడల్ కోడ్ తదితర అంశాలపై సమీక్షించారు. పలు అంశాలపై సూచనలు చేశారు.



పోలీసుల గౌరవ వందనం స్వీకరిస్తున్న రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్‌రాజ్

ఓటు హక్కుపై విస్తృత ప్రచారం చేయాలి

ఓటు హక్కుపై విస్తృత ప్రచారం చేయాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్‌రాజ్ అన్నారు. ఈ నెల 30వరకు 18ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు నమోదు చేసుకునే విధంగా ప్రచార కార్యక్రమాలు చేపట్టాలని, ఓటరు నమోదు, పోలింగ్ శాతాన్ని పెంచే విధంగా ఓటు హక్కు ప్రాముఖ్యతను తెలియజేయాలని అన్నారు. నామినేషన్ల స్వీకరణ సమయంలో నిబంధనలు పాటించాలని తెలిపారు. ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు, స్టాటిక్ సర్వేలైన్స్, వీడియో సర్వేలైన్స్, అకౌంట్ బృందాల అధికారులు పక్షపాతం లేకుండా విధులు నిర్వర్తించాలని సూచించారు. కంట్రోల్‌రూం, మీడియా సెంటర్ల నోడల్ అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని తెలిపారు. రాజకీయ పార్టీలు, అభ్యర్థులకు సంబంధించిన ప్రకటనలకు నిబంధనలకు లోబడి అనుమతి జారీ చేసేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. సువిధ యాప్‌ను నిరంతరం పరిశీలించాలని, ఎన్నికల నివేదికలను ప్రతీరోజు సమర్పించాలని ఆదేశించారు. జిల్లాల్లో దివ్యాంగు ల ఓటర్లను పోలింగ్ కేంద్రాల వారీగా మ్యాపింగ్ చేసుకోవాలని, కంట్రోల్ రూమ్, 1950, సీ-విజిల్‌లో అందిన ఫిర్యాదులు వేగంగా పరిష్కరించాలని చెప్పారు. జిల్లాల వారీగా ఎన్నికల నిర్వహణపై అమలు జరుగుతున్న కార్యక్రమాలను సమీక్షించారు.



భైంసా మార్కెట్‌యార్డులో విక్రయానికి తెచ్చిన సోయా

భైంసా వ్యవసాయ మార్కెట్ యార్డుకు రైతులు శుక్రవారం భారీగా సోయా విక్రయానికి తెచ్చారు. ఆటోలు, ట్రాక్టర్లలో సోయా తీసుకురాగా, దాదాపు గంటపాటు వాహనాలు గంజ్ గేటు ఎదుట రోడ్డుపైనే నిలిచిపోయాయి. ఒక్కరోజులోనే 905 లాట్లు రావడంతో కమీషన్ ఏజెంట్లు కాంటాలు సకాలంలో పూర్తి చేయలేమని చేతులెత్తేశారు. శనివారం బీట్ నిలిపివేయాలని మార్కెట్‌కమిటీ అధికారులను కోరారు. దీంతో శనివారం బీట్ నిలిపేయనున్నట్లు మార్కెట్ కమిటీ అధికారులు ప్రకటించారు. ఆదివారం సెలవు కావడంతో తిరిగి సోమవారం కొనుగోళ్లు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. – భైంసాటౌన్

మరోసారి.. ఆశీర్వదించండి

- అభివృద్ధి, సంక్షేమం కేసీఆర్‌తోనే సాధ్యం
- ఎన్నికల ప్రచారంలో ఇంద్రకరణ్‌రెడ్డి



ప్రచారంలో మాట్లాడుతున్న మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి

నిర్మల్‌టౌన్: ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా సీఎం కేసీఆర్ పరిపాలన కొనసాగిస్తున్నారని, ప్రజా, రైతు సంక్షేమ కార్యక్రమాలు అమలు కావాలంటే మరోసారి బీఆర్‌ఎస్‌ను ఆశీర్వదించాలని మంత్రి, నిర్మల్ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి కోరారు. జిల్లా కేంద్రంలోని బంగల్‌పేట్ నుంచి శుక్రవారం ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టారు. 2, 3, 4, 5 వార్డుల్లో ఇంటింటా ప్రచారం చేశారు. వృద్ధులు, మహిళలను ఆప్యాయంగా పలకరించారు. బీఆర్‌ఎస్ మేనిఫెస్టో వివరిస్తూ ఆశీర్వదించాలని కోరారు. అంతకుముందు స్థానిక మహాలక్ష్మి ఆలయంలో పూజలు నిర్వహించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. ప్రజల సంక్షేమానికి సీఎం కేసీఆర్ అహర్నిశలు కృషి చేస్తున్నారన్నారు. బీఆర్‌ఎస్ మేనిఫెస్టోలో ఉన్న హామీలను తప్పకుండా అమలు చేస్తామన్నారు. కేసీఆర్ భరోసాతో తెల్ల రేషన్‌కార్డుదారులందరికీ బీమా కల్పిస్తామని తెలిపారు. రేషన్‌పై సన్న బియ్యం పంపిణీ చేస్తామని పేర్కొన్నారు. సౌభాగ్యలక్ష్మి కింద మహిళలకు రూ.3 వేల భృతి, రూ.400లకే సిలిండర్, రైతుబంధు, ఆసరా పింఛన్ల పెంపు వంటి పథకాలు అమలు చేస్తామని వివరించారు.

ఆలు లేదు చూలు లేదు...

ఆలు లేదు చూలు లేదు.. కొడుకు పేరు సోమలింగం అన్నట్లు కాంగ్రెస్ పార్టీ తీరు ఉందని ఎద్దేవా చేశారు. ఎన్నికలు ముగియక ముందే కాంగ్రెస్ నాయకులు పగటి కలలు కంటున్నారని, ఇప్పుడే అధికారంలోకి వచ్చినట్లు, సీఎం అయినట్లు భ్రమల్లో ఉన్నారని ఎద్దేవా చేశారు. రైతుబంధు ఆపాలని కుట్రలు చేస్తున్న కాంగ్రెస్ పార్టీకి ప్రజలు తగిన బుద్ధి చెప్పాలని కోరారు. నిర్మల్ కాంగ్రెస్ అభ్యర్థికి 15 ఏళ్లు నియోజకవర్గం గుర్తుకు రాలేదని, ఇనేళ్లు ఎక్కడ దాక్కున్నారని ప్రశ్నించారు. ఇక బీజేపీ కేవలం మతం ఆధారంగా ఓట్లు దండుకోవాలని చేస్తోందని ఆరోపించారు. బీజేపీని నమ్మే పరిస్థితి లేదన్నారు. ప్రచారంలో మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్, మాజీ చైర్మన్ అప్పాల గణేశ్, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు పాకాల రాంచందర్, అప్పాల మహేష్, ప్రభాకర్, అల్లోల తిరుపతిరెడ్డి, అల్లోల గౌతమ్‌రెడ్డి, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు రాము పాల్గొన్నారు.

యుడైస్‌లో వంద శాతం నమోదు చేయాలి

- ఎస్‌ఈఏఎస్ సర్వే పకడ్బందీగా నిర్వహించాలి
- జూమ్ మీటింగ్‌లో విద్యాశాఖ అధికారులు



జూమ్ మీటింగ్‌లో పాల్గొన్న జిల్లా అధికారులు

నిర్మల్ రూరల్: జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల వివరాలు యుడైస్‌లో వంద శాతం నమోదు చేయాలని రాష్ట్ర విద్యాశాఖ కార్యదర్శి వాకాటి కరుణ, విద్యాశాఖ డైరెక్టర్ శ్రీదేవసేన సూచించారు. స్టేట్ ఎడ్యుకేషనల్ అచీవ్‌మెంట్ సర్వేపై వారు డీఈవోలతో శుక్రవారం జూమ్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. స్టేట్ ఎడ్యుకేషనల్ అచీవ్‌మెంట్ సర్వే వచ్చేనెల 3న 3, 6, 9వ తరగతి విద్యార్థులకు నిర్వహిస్తామన్నారు. పాఠశాలల్లో విద్యార్థుల ఫేషియల్ అటెండెన్స్ పగడ్బందీగా నిర్వహించాలన్నారు. ఎఫ్ఎల్ఎన్, ఉన్నతి, లక్ష్య మొదలగు కార్యక్రమాలు పాఠశాలల్లో సమర్థవంతంగా అమలు చేసేలా చూడాలని తెలిపారు. శనివారం అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహించే పేరెంట్స్ మీటింగ్‌లో వివిధ అంశాలపై చర్చించాలని సూచించారు. విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వం నూతనంగా ఇవ్వదలచిన 'అపార్' గుర్తింపు కోసం తల్లిదండ్రుల నుంచి సమ్మతి పత్రం తీసుకోవాలని తెలిపారు. విద్యాశాఖలో జరుగుతున్న అన్ని కార్యక్రమాలను పకడ్బందీగా నిర్వహించాలన్నారు. జూమ్ మీటింగ్‌లో ఎంఈవోలు, జిల్లా కోఆర్డినేటర్లు, మండల మోడల్ ఆఫీసర్లు, స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, ఎఫ్ఎల్ఎన్, ఉన్నతి, డీఆర్పీలు, సీఆర్పీలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

బీఆర్‌ఎస్‌పై కార్యకర్త వీరాభిమానం


చెప్పులు లేకుండా కపిల్

తాంసి: భీంపూర్ మండలంలోని అంతర్గాం గ్రామానికి చెందిన యువ నాయకుడు బక్కి కపిల్ యాదవ్ బీఆర్‌ఎస్ పార్టీపై తనకున్న అభిమానాన్ని కాళ్లకు చెప్పులు వేసుకోకుండా తెలియజేస్తున్నాడు. తెలంగాణ రాష్ట్రంలో బీఆర్‌ఎస్ పార్టీ గెలుపొంది ముఖ్యమంత్రిగా కేసీఆర్ ముచ్చటగా మూడోసారి ప్రమాణస్వీకారం చేసే వరకూ, బోథ్ బీఆర్‌ఎస్ అభ్యర్థి అనిల్ జాదవ్ ఎమ్మెల్యేగా గెలుపొందే వరకూ చెప్పులు ధరించకుండా పార్టీ నిర్వహించే కార్యక్రమాలకు హాజరవుతున్నాడు. శుక్రవారం భీంపూర్ మండల కేంద్రంలో నిర్వహించిన కార్యకర్తల సమావేశానికి సైతం చెప్పులు ధరించకుండా హాజరయ్యాడు.

మద్యం పట్టివేత


కుంటాల: పట్టుకున్న మద్యంతో పోలీసులు

కుంటాల: మండలంలోని దౌనెల్లితండా చెక్‌పోస్ట్ వద్ద ఎస్సై హన్మాండ్లు ఆధ్వర్యంలో శుక్రవారం పోలీసులు వాహనాల తనిఖీ చేశారు. గందే గంగయ్య వాహనంలో 24కింగ్ ఫిషర్ బీర్లను స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ రూ.3,900 ఉంటుంద ని, కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నాడు.

జైనథ్: మండలంలోని సాత్నల, మాంగుర్ల గ్రామాల్లో బెల్ట్‌షాప్ నిర్వహిస్తున్నారనే సమాచారంతో సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ డి.సాయినాథ్ ఆధ్వర్యంలో శుక్రవారం పోలీసులు దాడులు నిర్వహించారు. రూ.11,000 విలువ చేసే 70 మద్యం, రూ.11,760 నగదును సీజ్ చేశా రు. పరారీలోని బెల్ట్‌షాపు నిర్వాహకుడిపై కేసు నమోదు చేయనున్నట్లు పోలీసులు తెలిపారు.

బెల్ట్‌షాప్‌లపై ఎక్సైజ్ అధికారుల దాడులు


పట్టుకున్న మద్యంతో ఎక్సైజ్ అధికారులు

ఖానాపూర్: ఎక్సైజ్ సీఐ సంపత్‌కృష్ణ, ఎస్సై రాయబారపు రవి ఆధ్వర్యంలో మండలంలోని పలు గ్రామాల్లో బెల్ట్‌షాప్‌లపై ఎక్సైజ్ అధికారులు ఆకస్మికంగా దాడులు నిర్వహించారు. మండలంలోని కొత్తపేట్, దిలావర్‌పూర్, నడింపల్లె, పాతఎల్లాపూర్ గ్రామాల్లోని బెల్ట్‌షాప్‌లపై దాడులు నిర్వహించి 24మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఎలాంటి లైసెన్స్ లేకుండా కల్లు అమ్ముతున్న ఇద్దరి వద్ద స్వాధీనం చేసుకున్న 180లీటర్ల కల్లును ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా రమేష్, భాగవ్వ, గంగు, లక్ష్మక్కలపై కేసులు నమోదు చేసినట్లు అధికారులు పేర్కొన్నారు.

గుర్తు తెలియని కారు ఢీకొని వృద్ధురాలి మృతి


సాయమ్మ (ఫైల్)

నర్సాపూర్(జి): మండలంలోని తురాటి గ్రామానికి చెందిన వృద్ధురాలు గుర్తు తెలియని కారు ఢీకొని మృతిచెందింది. గ్రామస్తుల వివరాల మేరకు.. గున్నాల సాయమ్మ (70) దసరా పండుగకు లోకేశ్వరంలోని బంధువుల ఇంటికి వెళ్లింది. బుధవారం సాయంత్రం అర్లి(కే) ఎక్స్‌రోడ్డు వద్ద బస్సు దిగి తురాటి గ్రామానికి నడుచుకుంటూ వస్తుండగా చాక్‌పల్లి గ్రామం వద్ద గుర్తు తెలియని కారు ఢీకొట్టింది. తీవ్ర గాయాలపాలైన వృద్ధురాలిని గ్రామస్తులు 108లో భైంసా ప్రభుత్వాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందింది. చిన్న కొడుకు గున్నాల సదానంద్ ఫిర్యాదు మేరకు గురువారం కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రవీందర్ శుక్రవారం తెలిపారు.

సలాం.. కుమురంభీం


జోడేఘాట్‌లోని భీం విగ్రహం

- జల్.. జంగల్.. జమీన్ నినాదంతో నైజాం సర్కార్‌తో పోరాడిన వీరుడు
- నేటికీ నెరవేరని యోధుడి ఆశయం
- నిర్వీర్యమవుతున్న గిరిజన చట్టాలు
- కాలరాస్తున్న పాలకులు, అధికారులు
- అలుపెరుగని ఆదివాసీల పోరాటం
- నేడు జోడేఘాట్‌లో భీం వర్ధంతి

కెరమెరి(ఆసిఫాబాద్): నాడు బ్రిటీష్ కబంధహస్తాల నుంచి భారతీయులను విముక్తులను చేసేందుకు స్వాతంత్ర్య పోరాటం చేసి అమరుడయ్యారు జాతిపిత మహాత్మాగాంధీ. జల్.. జంగల్.. జమీన్.. నినాదంతో భూమి, నీరు, అడవి కోసం అప్పటి నైజాం ప్రభుత్వంలోని మిలటరీతో సాయుధ పోరాటం చేసి అసువులు బాసాడు గిరిజన ముద్దబిడ్డ కుమురంభీం.. ఆయన పోరాటం చేసి 83 ఏళ్లు గడుస్తున్నా.. అతడి ఆశయం మాత్రం నెరవేరలేదు. నేటికీ తాగు, సాగునీరు, సరైన రోడ్లు, పాఠశాలలు లేని పల్లెలు కోకొల్లలు. అందుకే ‘భీం నువ్ మళ్లీ పుట్టాలి’ అంటున్నారు అమాయక ఆదివాసీలు. నేడు జోడేఘాట్‌లో కుమురంభీం 83వ వర్ధంతి నిర్వహిస్తున్న సందర్భంగా ప్రత్యేక కథనం..

పట్టని ఆదివాసీ హక్కులు

నాటి నుంచి నేటి దాకా ఆదివాసీల పరిస్థితి కడు దయనీయం. భూమి, నీరు, అడవిపై ఇంకా వారికి స్వాతంత్ర్యం రాలేదు. గిరిజన హక్కులు కల్పించాల్సిన అధికారులు, ప్రజాప్రతినిధులు మిన్నకుండిపోతున్నారు. గిరిజన చట్టాలు.. గిరిజనేతరుల చుట్టాలవుతున్నాయి. అయినా ప్రభుత్వాలు ప్రేక్షక పాత్ర వహిస్తున్నాయి. హక్కులు.. చట్టాల గురించి హితబోధ చేసేవారే వాటిని కాలరాస్తున్నారు. అప్పటి నైజాం సర్కారు ఆదివాసీ భూముల రక్షణకు భూబదలాయింపు చట్టం 1/70 తీసుకువచ్చినా రక్షణ కల్పించే అధికార యంత్రాంగం ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. దీంతో గిరిజనుల భూములను గిరిజనేతరులు గుట్టుచప్పుడు కాకుండా ఆక్రమించుకుంటున్నారు. భూబదలాయింపు నిషేధం ఉన్న షెడ్యూల్ ప్రాంతాల్లో గిరిజనేతరుల వలసలు పెరిగి భూముల ఆక్రమణ యథేచ్ఛగా సాగుతోంది. దీంతో గిరిజనులు మళ్లీ అడవిని నరుక్కుని బతకాల్సిన పరిస్థితులు ఏర్పడుతుండగా.. ఇందుకు అటవీ అధికారులు అడ్డంకిగా మారారు. స్వాతంత్ర్యం వచ్చి 76 ఏళ్లు గడిచినా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదివాసీ హక్కులను వారి దరికి చేర్చడంలేదు.

ఐదో షెడ్యూల్‌కు తూట్లు..

భారత రాజ్యాంగంలోని ఐదో షెడ్యూల్ ప్రకారం ఆదివాసీలకు అడవి, భూమి, నీటిపై పూర్తి హక్కు ఉన్నప్పటికీ నూతన చట్టాలు వాటికి తూట్లు పొడుస్తున్నాయి. రాజ్యాంగానికి భంగం కలిగిస్తున్నాయి. 2005 బిల్లు ప్రవేశపెట్టి హక్కులను కల్పిస్తామని గతంలోని ప్రభుత్వాలు చెప్పినా అవి అమలు కాలేదు. ఏజెన్సీ ప్రాంతంలోని నీటి వనరులు పూర్తిగా ఆదివాసీలకే దక్కాలని రాజ్యాంగంలో ఉంది. కుంటలు, చెరువుల నిర్మాణంలో ఆదివాసీలు భూములు కోల్పోగా గిరిజనేతరులకే వాటి ఫలాలు అందుతున్నాయి. ఐటీడీఏ నిధులతో నిర్మించినా కుంటలు, చెరువుల్లో పెంచుతున్న చేపలు, రొయ్యలపై హక్కు ఆదివాసీలకే దక్కాలని చట్టాలు చెబుతున్నా వారి గోడు పట్టించుకునే వారు కరువయ్యారు. కొంతకాలంగా ఇతర ప్రాంతాల నుంచి వలస వచ్చి ఎస్టీలుగా చెప్పుకొంటున్నవారు నిజమైన గిరిజనులకు అన్యాయం చేస్తున్నారు. వారి వలసలను నిరోధించే దమ్ము, ధైర్యం అధికారులకు లేకపోయింది. పైగా.. ఎన్నో ఏళ్లుగా ఇక్కడే నివసిస్తున్నట్లు ధ్రువీకరణ పత్రాలు కూడా జారీ చేయడం వారికే చెల్లింది.

ఎన్నికలప్పుడే వాగ్దానాలు

వివిధ రాజకీయ పార్టీలు ఆదివాసీలను ఓటు బ్యాంక్‌గా మాత్రమే వాడుకుంటున్నాయి. ఎన్నికలు వచ్చాయంటే మైకు చేత బట్టుకుని వాగ్దానాల వర్షం కురిపిస్తారు. ఆ తర్వాత పత్తా లేకుండా పోతారు. 1/70 చట్టం గురించి ఎరుగని వారుండరు. కానీ.. నేడు ఏజెన్సీలో పుట్టగొడుగుల్లా.. మిద్దెలకు మిద్దెలు నిర్మిస్తుంటే అడ్డుకోవాల్సిన అధికారులు మిన్నకుండిపోతున్నారు.


రెండు కిలోమీటర్ల దూరం నుంచి నీళ్లు తెచ్చుకుంటున్న ఆదివాసీలు

అమలుకు నోచుకోని జీవోలు


ఆదివాసీల రక్షణకు అప్పట్లో ప్రభుత్వాలు జారీ చేసిన జీవోలు అమలుకు నోచుకోవడంలేదు. గిరిజన ప్రాంతాల్లోని ఉద్యోగాలు వంద శాతం గిరిజనులకే చెందాలని జారీ చేసిన జీవో 3ను సుప్రీంకోర్టు కొట్టివేసింది. 50 శాతానికంటే ఏజెన్సీ గిరిజనులకు మించకూడదని ఉత్తర్వులో పేర్కొంది. కానీ.. రాష్ట్ర ప్రభుత్వం మాత్రం ఇంకా దానిపై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. ఇటీవల ఉద్యోగ, ఉపాధ్యాయుల బదిలీల్లో ఏజెన్సీ, నాన్ ఏజెన్సీకి సంబంధం లేకుండా ఏజెన్సీల్లోనూ గిరిజనేతర ఉద్యోగులను భర్తీ చేసింది. ఏజెన్సీల్లోని నిరుద్యోగులు అయోమయంలో పడ్డారు. 1/70 చట్టాన్ని కూడా 2/70 గా మార్చే ఆలోచనలో ప్రభుత్వం ఉంది. ఇ లా ఇష్టారీతిన ప్రభుత్వం వ్యవహరిస్తుంటే ఆ దివాసీల మనుగడ ప్రశ్నార్థకమైంది. 317జీవోను అమలు చేయడంతో గిరిజన ప్రాంతాల్లోని పోస్టుల్లో గిరిజనేతరులు భర్తీ కావడంతో స్థానిక నిరుద్యోగులు నష్టపోయారు. దీనిపై గిరిజన ఎంపీలు, ఎమ్మెల్యేలు నోరు మెదపకపోవడం గమనార్హం.

ఆదివాసీ యోధుడు..

ఆసిఫాబాద్: ఆసిఫాబాద్ మండలం రౌటసంకెపల్లిలో కుమురం చిన్ను, సోంబాయి దంపతులకు 1901లో కుమురంభీం జన్మించారు. జల్, జంగల్, జమీన్ నినాదంతో నిజాం ప్రభుత్వంపై పోరు సాగించారు. తండ్రి విషజ్వరంతో మృతి చెందడంతో సోదరులు సోము, బొజ్జుతో కలిసి సంకెపల్లి వీడి కెరమెరి మండలం సుర్దాపూర్‌కు చేరారు. అక్కడ ఆదివాసీలు అడవిని నరికి సేద్యం చేయగా పంట చేతికొచ్చే సమయానికి సిద్దిక్ అనే జాగిర్దార్ భూముల తమవేనని గొడవకు దిగాడు. సిద్దిక్‌పై భీం దాడి చేయడంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. భీం అక్కడి నుంచి పారిపోయి బల్లార్షా మీదుగా మహారాష్ట్రలోని చాందా చేరుకున్నారు. అక్కడి నుంచి అస్సాం వెళ్లి కాఫీ తోటల్లో పనిచేస్తూ ఐదేళ్లపాటు అక్కడే ఉండిపోయారు. అనంతరం కెరమెరి మండలం జోడేఘాట్ తిరిగివచ్చారు.

జోడేఘాట్ కేంద్రంగా గెరిల్లా పోరాటం

కెరమెరి మండలం జోడేఘాట్ కేంద్రంగా కుమురంభీం నిజాం సర్కార్‌తో గెరిల్లా పోరాటం చేశారు. సూరు, వెడ్మ రాము భీంకు సహచరులుగా ఉన్నారు. పంటలు దోచుకునేందుకు వచ్చే వ్యాపారులు, పన్ను వసూళ్లకు వచ్చే రెవెన్యూ అధికారులపై భీం, ఆయన అనుచరులు దాడులు కొనసాగించారు. బాబేఝరి కేంద్రంగా గిరిజనులు అడవి నరికి 12 పోరు గ్రామాలను ఏర్పాటు చేశారు. దీంతో ప్రభుత్వం వారిపై కేసులు పెట్టింది. కేసుల నుంచి విముక్తి కోసం నిజాం నవాబును కలిసేందుకు భీం హైదరాబాద్ వెళ్లినా నిరాశే ఎదురైంది. ఈ క్రమంలోనే 12 గ్రామాలపై దాడులు చేయడంపై కలత చెందిన భీం అటవీశాఖ అధికారులపై తిరగబడ్డారు. యువకులను ఏకం చేసి సాయుధ దళం ఏర్పాటు చేశారు. చివరి ప్రయత్నంగా ప్రభుత్వం సబ్ కలెక్టర్‌ను చర్చల కోసం జోడేఘాట్‌కు పంపింది. 12 గ్రామాలకు పట్టాలిస్తామని.. అప్పులన్నీ మాఫీ చేస్తామని ప్రతిపాదించింది. కానీ 12 పోరుగ్రామాల మీద రాజ్యాధికారం కావాలని డిమాండ్ చేయడంతో చర్చలు విఫలమయ్యాయి. విషయం నిజాం నవాబుకు తెలియడంతో భీంను అంతమొందించాలని ఆదేశించాడు. 1940లో దాదాపు ఏడు నెలలు భీం అనుచరులు, నిజాం సేనల మధ్య యుద్ధం జరిగింది. దట్టమైన అడవిలో భీం ఆచూకీ దొరకలేదు. మడావి కొద్దు ఇచ్చిన సమాచారంతో అక్టోబర్ 10న భీకర పోరులో భీం నేలకొరిగారు. నాలుగు దశాబ్దాలుగా ఏటా జోడేఘాట్‌లో భీం వర్ధంతి నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది ఎన్నికల కోడ్ అమల్లో ఉండడంతో దర్బార్ రద్దు చేశారు.


ఆదివాసీల పూరిళ్లు

నగదు పట్టివేత


పట్టుకున్న నగదుతో పోలీసులు

బోథ్: మండలంలోని ఘన్‌పూర్ చెక్‌పోస్టు వద్ద ఎన్నికల తనిఖీ సిబ్బంది వాహనాలను పరిశీలిస్తుండగా శుక్రవారం మహారాష్ట్రలోని మాహూర్ నుంచి ఇన్నోవా వాహనంలో హైదరాబాద్ వెళ్తున్న వారి వద్ద నుంచి రూ.3లక్షలు పట్టుకున్నారు. వాహనంపై నగరాధ్యక్షుడు అని రాసి ఉంది. కాగా పట్టుకున్న నగదుకు ఎలాంటి ఆధారాలు చూపకపోవడంతో సీజ్ చేశారు. సిబ్బంది రఘువీర్ రెడ్డి, కానిస్టేబుల్ నాందేవ్, మోహన్, రమేష్ ఉన్నారు.

రూ. 2.20లక్షల నగదు పట్టివేత

జైనథ్: మండలంలోని పిప్పర్‌వాడ చెక్‌పోస్ట్ వద్ద కారులో తరలిస్తున్న రూ.2.20లక్షల నగదును సీజ్ చేసినట్లు వన్‌టౌన్ ఎస్సై నారాయణ తెలిపారు. మహారాష్ట్ర నారాయణ్‌పేట్‌కు చెందిన మహేష్‌యాదవ్ కారులో మహారాష్ట్ర నుంచి ఆదిలాబాద్ వైపు వస్తున్నాడు. చెక్‌పోస్ట్ వద్ద పోలీసులు వాహనాన్ని తనిఖీ చేయగా నగదు లభించింది. సరైన పత్రాలు లేకపోవడంతో కేసు నమోదు చేసి సీజ్ చేసినట్లు ఎస్సై తెలిపాడు.

పలువురిపై కేసు నమోదు

దిలావర్‌పూర్: మండల కేంద్రంలో గురువారం రాత్రి దాడి ఘటనలో పలువురిపై కేసులు నమోదు చేసినట్లు ఎస్సై యాసిర్ అరాఫత్ తెలిపాడు. మండల కేంద్రంలో గురువారం రాత్రి నిర్మల్ పట్టణానికి చెందిన కాంగ్రెస్ నేత అర్జుమన్ అలీ అనే నాయకుడు దిలావర్‌పూర్‌లోని మైనార్టీ అభివృద్ధికి నిధులు అందిస్తానని, తాను చెప్పిన వారికి ఓటు వేయాలని చర్చించారు. ఇందులో స్థానిక మైనార్టీ నాయకుడు అన్వర్‌తో చర్చించగా అన్వర్ కుమారుడైన సోహెల్ ఎందుకు ఇలాంటి చర్చలు అంటూ నిరాకరించడంతో స్థానిక కాంగ్రెస్ మైనార్టీ నాయకుడు వసీం అతడి అనుచరులతో దాడి చేశాడని శుక్రవారం పోలీసులకు సోహెల్ ఫిర్యాదు చేశాడు. వసీంతో పాటు అతడి అనుచరులపై కేసులు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

అగ్నివీర్‌కు యువకుల ఎంపిక




తౌటు నితిన్ ఎక్లరి సాయి రాజశేఖర్

బోథ్: అగ్నివీర్ ఫలితాలు శుక్రవారం విడుదలయ్యాయి. ఈ ఫలితాల్లో బోథ్ పట్టణానికి చెందిన గంగుల రాజశేఖర్, తౌటు నితిన్, ఎక్లరీ సాయిలు అగ్నివీర్‌కు ఎంపికయ్యారు. వీరికి పట్టణ వాసులు శుభాకాంక్షలు తెలిపారు. కాగా గ్రామానికి చెందిన తౌటు మల్లేష్ కుమారుడు తౌటు నిఖిల్ 2019లో ఆర్మీలో ఎంపిక కాగా రెండవ కుమారుడు తౌటు నితిన్ అగ్నివీర్‌లోని నేవీకి ఎంపికయ్యాడు.

కాంగ్రెస్ అభ్యర్థుల బయోడేటా..

కంది శ్రీనివాసరెడ్డి

తల్లిదండ్రులు	: కందిఅనసూయ-కిష్టారెడ్డి
పుట్టిన తేది	: 05-08-1983
గ్రామం	: హస్నాపూర్, మండలం తాంసి, జిల్లా ఆదిలాబాద్
భార్య	: కంది సాయిమౌనారెడ్డి
పిల్లలు	: కూతురు అరికరెడ్డి, కొడుకు ఇషాన్‌రెడ్డి

విద్యార్హత : ప్రాథమిక విద్యాభ్యాసం 1 నుంచి 5వ తరగతి వరకు స్వగ్రామమైన హస్నాపూర్ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల. 6వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు కాగజ్‌నగర్ జవహర్ నవోదయ విద్యాలయంలో పూర్తి చేశాడు. అమెరికాలోని మిస్సోరి యూనివర్సిటీ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ నుంచి ఇన్ఫర్మేషన్ టెక్నాలజీలో మాస్టర్ ఆఫ్ సైన్స్ చేశారు.

రాజకీయ ప్రవేశం : 2022 ఆగస్టు 21వ తేదీన పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ తరుణ్‌చుగ్ సమక్షంలో బీజేపీ పార్టీలో చేరారు. 2023 మే 8వ తేదీన ప్రియాంక గాంధీ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరాడు.

అజ్మీరా శ్యామ్‌నాయక్

పుట్టిన తేదీ	: 10 -10- 1970
భార్య	: రేఖానాయక్ (ఖానాపూర్ ఎమ్మెల్యే)
కుమార్తె	: పూజానాయక్
కుమారుడు	: అక్షిత్
సామాజిక వర్గం	: ఎస్టీ (లంబాడా)
విద్యాభ్యాసం	: బీఈ, ఉస్మానియా విశ్వవిద్యాలయం, బ్యాచిలర్ ఆఫ్ జర్నలిజం(ఉస్మానియా విశ్వవిద్యాలయం), ఎల్‌ఎల్‌బీ (శాతవాహన విశ్వవిద్యాలయం)
ఉద్యోగం	ఎంపీఐ (ఆదిలాబాద్/ఆసిఫాబాద్), డీటీవో(ఆసిఫాబాద్/జగిత్యాల)

ఖానాపూర్..

పూర్తిపేరు	: వెడ్మ బొజ్జుపటేల్
వయస్సు	: 37
కులం	: ఎస్టీ(గోండు)
విద్యార్హత	: ఎంఏ, బీఈడీ, ఎల్ఎల్‌బీ
స్వస్థలం	: కల్లూరుగూడ, ఘన్‌పూర్ పంచాయతీ, మం.ఉట్నూరు
తల్లిదండ్రులు	: వెడ్మ గిరిజాబాయి, భీంరావు
భార్య	: వెడ్మ ద్రుపద(టీచర్)
కుమారులు	: తనీశ్‌పటేల్ రాజ్‌గోండ్, నితీశ్‌పటేల్ రాజ్‌గోండ్

సామాజిక బాధ్యతలు :
- 2012-16 ఆదివాసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు
- 2016నుంచి ఆదివాసీ విద్యార్థి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి
- ఆదివాసీ హక్కుల పోరాట సమితి(తుడుందెబ్బ) సలహాదారు
- 2016-18 గిరిజన యూనివర్సిటీ సాధన పోరం కన్వీనర్
- 2018-19 యంగ్ జనరేషన్ యూత్ ఫోరం ఆదిలాబాద్ జిల్లా ఉపాధ్యక్షుడు
- 2018-21 పీసా జిల్లా కో-ఆర్డినేటర్

రాజకీయ అనుభవం :
- 2021, ఆగస్టు 04న పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిక
- పీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియామకం
- ఆదిలాబాద్ డీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్
- ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి

ముథోల్..

పూర్తి పేరు	: భోస్లే నారాయణరావు పటేల్
వయస్సు	: 65ఏళ్లు
విద్యార్హత	: ఇంటర్మీడియట్
స్వస్థలం	: భైంసా(బడ్‌గాం)
కులం	: ఆరె మరాఠా(బీసీ-బీ)
తల్లిదండ్రులు	: కమలాబాయి, గోపాల్‌రావుపటేల్
భార్య	: లక్ష్మీబాయి
కొడుకు, కుమార్తె	: అఖిలేశ్‌పటేల్, అర్చన
పార్టీలు	: టీడీపీ,టీఆర్‌ఎస్,కాంగ్రెస్, ఎన్‌సీపీ

రాజకీయ అనుభవం..
- 1994 ఎన్నికల్లో టీడీపీ తరఫున పోటీచేసి ఎమ్మెల్యేగా గెలుపు
- 1999 రెండోసారి టీడీపీ నుంచి ఓటమి
- 2004లో టీఆర్‌ఎస్‌లో చేరి ఎన్నికల్లో పోటీచేసి రెండోసారి ఎమ్మెల్యేగా విజయం
- 2014 ఎన్నికల్లో కాంగ్రెస్ ఆదేశాల మేరకు పోటీ నుంచి దూరం
- 2018ఎన్నికల్లో కాంగ్రెస్ సీటు దక్కకపోవడంతో ఎన్‌సీపీలో చేరి పోటీచేసి ఓటమి

సిర్పూర్..

పేరు	: రావి శ్రీనివాస్
పుట్టిన తేదీ	: 05- 04- 1975
తల్లిదండ్రులు	: రావి మోహన్‌రావు, ఝాన్సీలక్ష్మి
భార్య	: రావి సునీత
కుమారుడు	: శ్రీసాయి ఓంకార్
సామాజిక వర్గం	: కమ్మ
స్వస్థలం	: గుంటూరు కాలనీ, కాగజ్‌నగర్
విద్యాభ్యాసం	: బీఏ

బోథ్ నియోజకవర్గం..

పేరు	: వన్నెల అశోక్
తల్లిదండ్రులు	: శకుంతల- కిష్టన్న
భార్య	: సునీత (వైద్యురాలు)
పిల్లలు	: కూతురు అర్యాయి, కుమారుడు అశ్విక్
గ్రామం	: తాంసి, జిల్లా, ఆదిలాబాద్
విద్యార్హత	: ఎంబీబీఎస్, ఎంఎస్

(మంచిర్యాలలో అర్థోపెడిక్ ప్రైవేట్ వైద్యుడిగా)

పుట్టిన తేది : 01- 06- 1985

రాజకీయ ప్రవేశం..

2018 ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీలో చేరి అప్పటి ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి గెలుపునకు కృషి చేశారు. ప్రస్తుతం టీపీసీసీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా కొనసాగుతున్నారు. తాంసిలో ఆయన తాత వన్నెల ఎల్లన్న తెలంగాణ సాయుధ పోరాటంలోనూ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయాలు

లక్సెట్టిపేట: మండల కేంద్రంలోని గోదావరి రోడ్డులో జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణానికి చెందిన వినయ్, మల్లేశ్ బైక్‌పై వెళ్తున్నారు. ఎదురుగా మరో బైక్‌పై వస్తున్న నవనీత్, నౌజర్ వస్తున్నారు. వీరి బైక్‌లు ఎదురెదురుగా ఢీకొనడంతో నలుగురికి గాయాలయ్యాయి.

బైక్ అదుపుతప్పియువకుడికి గాయాలు

బెల్లంపల్లిరూరల్: రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్రగాయాలయ్యాయి. తాళ్లగురిజాల ఎస్సై నరేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. తాండూర్ మండలం తంగళ్లపల్లి గ్రామానికి చెందిన మారెల్లి పవన్ సింగరేణిలో కాంట్రాక్ట్ కార్మికుడు. శుక్రవారం బెల్లంపల్లికి పని నిమిత్తం వచ్చి తిరిగి ఇంటికి తన ద్విచక్ర వాహనంపై వెళ్తున్నాడు. కన్నాల శివారులోని బైక్ అదుపుతప్పి పడిపోయింది. ఈ ప్రమాదంలో పవన్‌కు తీవ్రగాయాలయ్యాయి.

చిరుత పులుల సంచారం..!

- ఆందోళన వ్యక్తం చేస్తున్న అన్నదాతలు
- అప్రమత్తంగా ఉండాలంటున్న అధికారులు

కుంటాల: నిర్మల్ జిల్లా దౌనెల్లి అటవీ ప్రాంతంలో రెండు చిరుతపులుల సంచారం కలకలం రేపుతోంది. స్థానికుల వివరాల ప్రకారం... వారం రోజుల క్రితం రైతు నీలి లస్మన్న, పాలేరు చాకలి గజేందర్‌తో కలిసి వ్యవసాయ పనుల కోసం ఎల్వుల లొద్దికి వెళ్లారు. పనులు చేస్తున్న వీరితో పాటు పశువులను చూసి గాండ్రించే అరుపులు వినబడగా భయంతో పరుగులు తీశారు. గ్రామస్తులకు విషయం చెప్పగా అధికారులకు సమాచారం ఇచ్చారు. ఎల్వులలొద్ది, గడిమెల, నర్సాపూర్(జి) మండలంలోని బూరుగుపల్లి(జి) అటవీ ప్రాంతం, గొల్లమాడ పెద్ద చెరువు పరిసర ప్రాంతాల్లో రెండు చిరుతపులులు సంచరిస్తున్నట్లు సమాచారం. అటవీ ప్రాంత శివారులో పంట చేనులో రైతులు, కూలీలు అప్రమత్తంగా ఉండాలని అటవీశాఖ అధికారులు సూచిస్తున్నారు. పంట చేనులకు వెళ్లేటప్పుడు ప్రజలు గుంపులు గుంపులుగా వెళ్లాలని తెలిపాడు. అలాగే డప్పులు చేసుకుంటూ వెళ్లడంతో జంతువులు వెళ్లిపోతాయని వివరిస్తున్నారు. పులులు కనిపిస్తే వెంటనే అటవీశాఖ అధికారులకు సమాచారం అందించాలని సూచిస్తున్నారు.

అనుమతి తప్పనిసరి

తాంసి: ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున పార్టీ పరంగా ఏ కార్యక్రమం నిర్వహించాలనుకున్నా ముందస్తుగా ఎన్నికల అధికారి అనుమతి తప్పనిసరి. ప్రస్తుతం నియోజకవర్గ వ్యాప్తంగా ఎన్నికల ప్రచారం ఊపందుకుంది. ఎన్నికల నియమావళి పాటిస్తూ ఆయా పార్టీల నాయకులు ప్రచారం నిర్వహిస్తున్నారు. శుక్రవారం భీంపూర్ మండల కేంద్రంలో నిర్వహించిన పార్టీ సమావేశం కోసం ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలపై అనుమతి పొందిన పత్రాలను అంటించారు. ఫ్లెక్సీలపై పత్రాలను సమావేశానికి హాజరైన నాయకులు, కార్యకర్తలు ఆసక్తిగా తిలకించారు.


ఫ్లెక్సీపై అతికించిన అనుమతి పత్రం

వాట్ ఎన్ ఐడియా...

సాధారణంగా ఎద్దులబండి నడపాలంటే బసవన్నలు అవసరం. కానీ ఈ చిత్రంలో మాత్రం బసవన్నలు లేకుండా ద్విచక్రవాహనానికి ఎడ్లబండిని కట్టి తీసుకెళ్తున్నాడు ఓ రైతన్న. తాంసి మండలంలోని సావర్గాం గ్రామానికి చెందిన గంగన్న మండలంలోని కప్పర్ల గ్రామంలో వెల్డింగ్‌షాప్‌లో ఎడ్లబండిని చేయించాడు. దానిని స్వగ్రామమైన సావర్గాంకు ఇలా తన బైక్‌కు తాడుతో కట్టి తీసుకెళ్లాడు.రైతన్న ఆలోచనను పలువురు అభినందించారు. – తాంసి



గడ్‌చాందలో ఒకరిపై దాడి..

- వివాహేతర సంబంధం ఉందనే అనుమానంతోనే..
- కేసు నమోదు చేసిన పోలీసులు
- తెల్లకల్లు దుకాణంలో ఘటన
- కత్తితో దాడిలో గాయాలు..

లోకేశ్వరం: మండలంలోని గడ్‌చాంద గ్రామంలో గురువారం రాత్రి ఒకరిపై కత్తితో దాడిచేయగా గాయాలయ్యాయి. ఎస్సై సాయికుమార్ వివరాల ప్రకారం... గడ్‌చాంద గ్రామానికి చెందిన గొల్ల సంజీవ్ బతుకుదెరువు కోసం విదేశాలకు వెళ్లాడు. అక్కడ పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఇటీవల స్వగ్రామానికి వచ్చాడు. సంజీవ్ భార్యకు అదే గ్రామానికి చెందిన శ్రీనివాస్‌తో వివాహేతర సంబంధం ఉందని అనుమానం పెంచుకున్నాడు. మూడేళ్లుగా గల్ఫ్ నుంచి పంపించిన డబ్బుల విషయమై భార్యను ప్రశ్నించగా ఆమె నుంచి సరైన సమాధానం చెప్పలేదు. దీంతో ఇద్దరి మధ్య గొడవ కాగా భార్య పుట్టింటికి వెళ్లిపోయింది. అప్పటి నుంచి మరింతగా అనుమానం పెంచుకున్నాడు. తాను లేని సమయంలో తన భార్యకు మాయమాటలు చెప్పి మోసం చేసి డబ్బులన్నీ వాడుకున్నాడని శ్రీనివాస్‌పై అనుమానం పెంచుకుని గురువారం రాత్రి తెల్లకల్లు దుకాణంలో ఉండగా కత్తితో దాడిచేశాడు. గాయాలపాలైన శ్రీనివాస్‌ను లోకేశ్వరంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం నిర్మల్ ఆస్పత్రికి తరలించారు. శుక్రవారం శ్రీనివాస్ భార్య పద్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని నిందితుడిని రిమాండ్ పంపినట్లు ఎస్సై పేర్కొన్నాడు.